## ధర్మస్థల ఘటనలపై న్యాయ విచారణ జరిపించాలి

-కారకులను కఠినంగా శిక్షించాలి -ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం




2 లో

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శనివారం | 09 | ఆగస్టు | 2025 పేజీలు : 8

# వైరా నదిపై మరో ఎత్తిపోతల పథకం






**ప్రజాపక్షం/ ఖమ్మం :** వైరా నదిపై మరో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి ఖమ్మం జిల్లాలోని సాగర్ చివరి ఆయకట్టు భూములకు నీరందించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఒక భారీ పథకానికి రూపకల్పన చేయడంతో పాటు ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. వైరా నది నీటిని ఒడిసిపట్టి సాగు నీటి కొరతను తీర్చేందుకు ఇప్పటికే వైరా ప్రాజెక్టు నుండి ఖమ్మం జిల్లా సరిహద్దు వరకు పలు ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. ఈ క్రమంలోనే సిరిపురం వద్ద ఎత్తిపోతల పథకం పనులు జరుగుతున్నాయి. రూ. 630 కోట్ల వ్యయంతో మధిర మండలం వంగవీడు వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి సాగర్ ఆయకట్టు చివరి భూములకు నీరందించేందుకు జవహార్ పేరుతో ఎత్తిపోతల

మిగతా 2లో..

**-సాగర్ చివరి ఆయకట్టుకు నీరందించే యత్నం**
**-రేపు శంకుస్థాపన చేయనున్న డిప్యూటి సిఎం భట్టి**
**-కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్**



# గుట్టకు పాస్‌బుక్ ఎలా.?



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గుట్టలు, కాలువలు, చెరువులు ప్రభుత్వ ఆస్తులుగా ఉంటాయి.. కాని గుట్టలకు పాస్ బుక్‌లు చూపిస్తూ ఎవరికి నచ్చినట్లు వారు తమదంటే, తమదంటూ ఆక్రమించుకోవటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు గ్రామస్థులు. సుమారు 200 ఎకరాల్లో విస్తరించి ఉన్న గుట్టను తవ్వి కోట్లు మింగాలని కోర్టును ఆశ్రయించి ఎవరికి వారే ముమ్మర ప్రయత్నాలు చేస్తుండగా, అధికారులు సైతం కోర్టు కాఫీలను సాకుగా చూపి ఆ వైపుకు పోకుండా తప్పించుకుంటున్నారు. పేదలు సెంటు స్థలం కోసం ప్రభుత్వ కార్యాలయాలు, నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే, బడా బాబులు మాత్రం ఎకరాలకు, ఎకరాలు మింగటానికి చట్టంలోని లొసుగులను పట్టుకుని కబ్జాలు చేస్తున్నారు. వివరాల్లోకెళ్ళితే.. మండల పరిదిలోని గంగారం గ్రామంలో గల 15వ బెటాలియన్ ఏకలవ్య షూటింగ్ రేంజ్ సమీపంలోని దాదాపు 200 ఎకరాల్లో విస్తరించి ఉన్న ప్రభుత్వ గుట్టను తవ్వి సాగుభూములుగా మారుస్తున్నారు కొందరు. ఇప్పటికే

మిగతా 2లో..

**-తవ్వి సాగు భూమిగా మారుస్తున్న వారిపై చర్యలుంటాయా..?**
**-ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్‌లో ఉండగా క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్లు ఎలా సాధ్యం..?**
**-నిద్రావస్థలో అధికార యంత్రాంగం**
**-15 ఎకరాల కబ్జా వెనుక హస్తం ఎవరిది..?**

# నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం









**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు గిరిజన ఐఖ్యకార్యచరణ కమిటీ పూర్తి సన్నాహాలు చేస్తోంది. ఐటిడిఏ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఈ కార్యక్రమాన్ని పండువలా నిర్వహించేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా భద్రాచలం పట్టణంలోని ఉన్న గిరిజన నేతల విగ్రహాలు కొత్త కళను సంతరించుకున్నాయి. అంబేద్కర్ సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు, గాం గంటం దొర, మల్లు దొర

మిగతా 2లో..

**- పోలవరంతో మూలవాసులకు పెను ప్రమాదం**
**- ఏటా భద్రాచలంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుక**
**- గిరిజన నేతల విగ్రహాలకు నూతన శోభ**
**- తొలిసారి కోయభాషలో ఆహ్వానపత్రిక**
**- ఐటిడిఏ ఆధ్వర్యంలో పండుగలా కార్యక్రమం**

# వైరా నదిపై మరో ఎత్తిపోతల పథకం

(మొదటిపేజీ తరువాయి)

పథకాన్ని నిర్మించనున్నారు. ఖమ్మం జిల్లాలో సాగర్ ఎడమ కాలువ క్రింద రెండున్నర లక్షల ఎకరాలు సాగవుతుంది. జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధిలో 16 మండలాలు ఉండగా ఇందులో మధిర, ఎర్రుపాలెం మండలాలు మూడవ జోన్‌లో ఉన్నాయి. సాగర్ రెండవ జోన్ దాటి ఇటీవల కాలంలో మూడవ జోన్‌కు సాగునీరు అందిన దాఖలాలు లేవు. ఈ క్రమంలో 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మధిర, ఎర్రుపాలెం మండలాలను సాగర్ మూడవ జోన్ నుంచి రెండవ జోన్‌కు మార్చారు. అంతే కాకుండా మధిర, ఎర్రుపాలెం మండలాలకు సాగర్ నీరు రావాలంటే కల్లూరు తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి వెళ్లి తిరిగి తెలంగాణ ఈ మండలాలకు రావాల్సి ఉంటుంది. సాగర్ ఆయకట్టు పరిధిలో మధిర, ఎర్రుపాలెం మండలాలకు సంబంధించి 50వేల ఎకరాలు ఉండగా ఇప్పుడు ఆ భూమికి సాగునీరు అందించేందుకు జవహార్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు మంజూరు కావడం పనులకు సంబంధించి ఒప్పందాలు పూర్తయ్యాయి. వైరా ప్రాజెక్టు అలుగు నుంచి ప్రారంభమయ్యే వైరా నది 33 కిలో మీటర్ల మేర ప్రవహించిన తర్వాత వంగవీడు వద్ద ఒక భారీ చెక్‌డ్యాంను నిర్మించనున్నారు. చెక్‌డ్యాం ఎగువ భాగం నుంచి పంపు హౌజ్ ద్వారా నీటిని తరలించనున్నారు. మూడు మోటార్లను ఏర్పాటు చేయనున్నారు. ఒక మోటార్ ద్వారా నిదానపురం వద్ద సాగర్ కాలువకు అనుసంధానం చేయనుండగా మరో మోటార్ ద్వారా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం సమీపంలో మరొకటి మైలవరం మేజర్‌కు అనుసంధానం చేయనున్నారు. ఈ పథకాల ద్వారా చిన్న, పెద్ద చెరువులను నింపడంతో పాటు కట్టేలేరు ప్రాజెక్టు రెండు ప్రధాన కాలువలను అనుసంధానం చేసి ఆయకట్టును స్థిరీకరించనున్నారు. నిదానపురం మేజర్‌లో 17వేల ఎకరాల ఆయకట్టు ఉండగా 11 కిలో మీటర్ల మేర పైపులైన్ నిర్మించి నాగవరపాడు సమీపంలో సాగర్ కాలువ వద్ద నీటిని వదలనున్నారు. మరో పైపులైన్ నూజివీడు బ్రాంచ్ కెనాల్ ద్వారా ఎర్రుపాలెం మండలంలో 10 వేల ఎకరాలు సాగవుతుండగా రెండవ మోటార్ ద్వారా నీరందించి ఈ ఆయకట్టును స్థిరీకరించనున్నారు. ఎర్రుపాలెం మండలంలోని ఐదువేల ఎకరాలకు మరో మోటార్ ద్వారా రాజుపాలెం సమీపంలో నీటిని విడుదల చేసి ఆయకట్టును స్థిరీకరించనున్నారు.

### నిరంతర విద్యుత్ కోసం సబ్‌స్టేషన్...

సాగునీటి ఇబ్బంది తలెత్తకుండా 24 గంటలు మోటార్లు పనిచేసేవిధంగా రూ. 25 కోట్లతో ప్రత్యేకంగా సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ సబ్ స్టేషన్‌ను కేవలం జవహర్ ఎత్తిపోతల పథకం కోసమే వినియోగించనున్నారు. వైరా నదిలో సరిపడ నీరు ఉండడం, విద్యుత్‌కు కూడా ఎటువంటి అంతరాయం లేకుండా ఉండడంతో దాదాపు 35 వేల ఎకరాలకు సాగునీటి కొరత తీరనుంది.

### భట్టి భగీరథ ప్రయత్నం...

మధిర నియోజక వర్గం నుంచి వరుసగా నాలుగు సార్లు విజయం సాధించిన భట్టి విక్రమార్కకు మంత్రిగా తొలిసారి అధికారంలో పాలు పంచుకునే అవకాశం దక్కింది. తొలిసారి 2009లో గెలిచి నప్పుడు చీఫ్‌విప్‌గా డిప్యూటీ స్పీకర్ పదవితోనే సరి పుచ్చుకున్నారు. ఆ తర్వాత 2014, 2018లో శాసన సభ్యునిగా విక్రమార్క గెలుపొందినా కాంగ్రెస్‌కు అధికారం దక్కలేదు. ఈసారి భారీ మెజార్టీతో గెలవడంతో పాటు మధిరకు ప్రాతినిథ్యం వహిస్తున్న ఆయనకు ఉప ముఖ్యమంత్రి పదవి దక్కడంతో పాటు ఆర్థిక, విద్యుత్ శాఖలు కూడా కేటాయించబడడంతో ఇప్పుడు మధిర నియోజక వర్గంపై తనదైన ముద్రవేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, వ్యవసాయ రంగ అభివృద్ధి, వ్యవసాయ, అనుబంధ పరిశ్రమల ఏర్పాటు, గృహ పరిశ్రమలకు ప్రోత్సహమిచ్చేందుకు దృష్టిసారించారు. వ్యవసాయ అభివృద్ధిలో భాగంగా సాగునీరు అందితే వ్యవసాయం పురోగమిస్తుందని అదే సమయంలో నిరంతరాయ విద్యుత్‌ను కూడా అందించే క్రమంలో భట్టివిక్రమార్క ప్రధాన దృష్టి సారించారు. వైరా నదిపై ఇప్పటికే జాలిముడి ప్రాజెక్టు ఆయన హయాంలో నిర్మించబడగా వైరా నది నీటిని సద్వినియోగం చేసుకునే దిశగా జవహర్ ఎత్తి పోతల పథకాన్ని ప్రారంభించనున్నారు. భట్టి విక్రమార్క భగీరథ ప్రయత్నానికి నియోజక వర్గ పరిధే కాకుండా జిల్లా వ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి.

# ధర్మస్థల ఘటనలపై న్యాయ విచారణ జరిపించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థలలో జరిగిన అమానవీయ ఘటనలు, హత్యలపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. మతం మాటున మారణ హోమం జరుగుతుందని ధర్మస్థల హత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పోటు కళావతి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ ధర్మస్థలలో అనేక మంది అమాయకుల ప్రాణాలను, మానాలను బలిగొన్నారని వారు ఆరోపించారు. మతం పేరుతో సుదీర్ఘ కాలం పాటు హత్యలు జరిగాయని ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య విభజన తీసుకు రావడమే కాకుండా మతాన్ని అడ్డుపెట్టుకుని ఆగడాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. దీని వెనక ఉన్న ఏ స్థాయిలో ఉన్న వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి, నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, ఏఐవైఎఫ్ నాయకులు నానబాల రామకృష్ణ, మద్దోజు శ్రవణ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ, ఏఐటియుసి నాయకులు లక్ష్మినారాయణ, ఐద్వా బాధ్యులు బండి పద్మ, మెరుగు రమణ, మాచర్ల లక్ష్మి, పివోడబ్ల్యూ బాధ్యులు గోకినేపల్లి లలిత, బి. ఝాన్సీ, లక్ష్మి, పిడిఎస్‌యు నాయకులు వెంకటేష్, యశ్వంత్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ , నాయకులు చింతల రమేష్, సుభాష్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గుట్టకు పాస్‌బుక్ ఎలా.?



(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రాంతంలోని 133వ సర్వే నెంబర్ లో ఉండాల్సిన దాని కంటే మూడు రెట్ల విస్తీర్ణంలో భూమి పహాణిల్లో నమోదై అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుండగా, ఈ సమస్యపై పలుమార్లు సర్వే కూడా సాగింది. ఈ సమస్య పరిష్కారం కాకుండానే గుట్ట కబ్జా సంఘటన ఈ ప్రాంత ప్రజలను అయోమయానికి గురి చేస్తుంది.

### ట్రిబ్యునల్ లో పెండింగ్...

గంగారంలోని 133వ సర్వే నెంబర్ లో దివంగత ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో దాదాపు 250 ఎకరాల సీలింగ్ తీశారు. కాగా సీలింగ్ డిక్లరేషన్ కాకపోవటంతో ఈ సర్వే నెంబర్ కు సంబంధించి అప్పట్లోనే ట్రిబ్యునల్ లో కేసు నమోదైంది. ఇంతవరకు కూడా ఎలాంటి జడ్జిమెంట్ రాలేదు.. కేసు పరిష్కారం కానప్పటికీ ఈ సర్వే నెంబర్ లో క్రయ, విక్రయాలు సాగటం, దొడ్డి దారిన పాసు బుక్కులు ఇవ్వడం తదితర నిబంధనలకు భిన్నంగా కార్యక్రమాలు యధేచ్చగా సాగాయి. ఇదిలా ఉండగా ఈ భూమి నాది అంటే.. నాది అంటూ రెండు, మూడు వర్గాల వారు కోర్టులను ఆశ్రయిస్తూ వస్తున్నారు.

### ఇక్కడ రెండు దందాలు..

గుట్ట తవ్వి కబ్జా చేస్తూ సాగు భూములుగా మారుస్తున్న సంఘటన ఒకటి కాగా గుట్ట తొలగించడం ద్వారా వచ్చే మట్టి బ్లాక్ మార్కెట్ కు తరలిస్తూ జేబులు నింపుకుంటున్న సంఘటన రెండవది. ఈ రెండు సంఘటనలతో ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లుతున్నప్పటికీ నవ్విపోదురులే నాకేటి చందాన అధికారులు వ్యవహరిస్తున్న తీరు పలు ఆరోపణలకు దారితీస్తుంది. ఈ నేపథ్యంలో కల్లూరు డివిజన్ కు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి ఈ సంఘటనపై దృష్టి సారించి కోర్ట్ ఆర్డర్లు పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలు పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందని ప్రజాస్వామ్యవాదులు భావిస్తున్నారు.

# నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం





(మొదటిపేజీ తరువాయి)

విగ్రహాలతో పాటు మార్కెట్ సమీపంలో ఉన్న కొమరం భీమ, జబల్‌పూర్ మహారాణి దుర్గాదేవి విగ్రహాలు బంగారు వర్ణాన్ని సంతరించుకున్నాయి. ఐటిడిఏ ఇందు కోసం నిధులను సమకూర్చింది. ఇదిలా ఉండగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐటిడిఏ చరిత్రలో తొలిసారిగా గిరిజన భాషలో ఆహ్వాన పత్రికను ముద్రించారు. ఈ పత్రికను ఇప్పటికే రాష్ట్ర పెద్దలకు సైతం అందజేశారు. నేడు భద్రాచలంలో జరిగే కార్యక్రమానికి ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావుతో పాటు జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్‌తో తదితరులు పాల్గొంటున్నారు. అంబేద్కర్ సెంటర్లోని ఆదివాసీ నేతల విగ్రహాలకు పూల మాలలు వేయడంతో పాటు కోయ నృత్యాలు, డప్పు వాయిధ్యాల నడుమ ఐటిడిఏ వరుక ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రత్యేక జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ఆచారాలు కలిగిన గిరిజన సంతతి భారత దేశంతో సహా ప్రపంచలోని అనేక దేశాల్లో నివశిస్తున్నారు. వీరు ఇతురలతో పోలిస్తే భిన్నమైన జీవన విధానాన్ని కలిగుంటారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి వెలుగుల్లోకి విహరిస్తున్న వారు గతంలో నాగరిక ప్రపంచానికి ఆమడ దూరంలో ఉన్నారు. ప్రంపచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐఖ్య రాజ్య సమితి మూల వాసులే నిజమైన ప్రకృతి పరిరక్షకులని 2024లో ప్రధానం అంశగా పేర్కొంది. కానీ 2025 కి సంబంధించిన ప్రధాన అంశాన్ని ప్రకటించలేదు. అమెరికాలో మొదటిసారిగా 1995లో గిరిజన దినోత్సవాన్ని జరుపుకున్నారు. అప్పట్నుంచి ప్రతీఏటా ఆగస్టు 9వ తేదిని ప్రపంచ వ్యాప్తంగా గిరిజన దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఐఖ్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1994లో మొదటిసారిగా అంతర్జాతీయ ఆదివాసీ ప్రజల సంవత్సరంగా ప్రకటించింది.

### ఆగస్టు 9వ తేదినే ఎందుకు..

1977లో జెనీవాలో అంతర్జాదీయ సమావేశాన్ని నిర్వహించారు. వలస పాలన సాగించిన కొలంబస్ దినోత్సవానికి బదులు గిరిజన దినోత్సవాన్ని జరుపుకోవాలని పట్టుపట్టారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని



జరుపుకోవడంలో అమెరికాలోని గిరిజనులకు ముఖ్యమైన సహకారం అందింది. ఐఖ్యరాజ్య సమితి ఆదివాసీ సంఘం హక్కుల కోసం అంతర్జాతీయ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసింది. దీని మొదటి సమావేశం 1982 ఆగస్టు 9న జెనీవాలోనే జరిగింది. ఈ సమావేశం జ్ఞాపకార్థం ఆగస్టు 9వ తేదిని ప్రపంచ ఆదివాసీదినోత్సవంగా ప్రకటించారు. దీంతో ఆగస్టు 9వ తేది ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ప్రతీ ఏటా జరుపుతుంటారు. జిల్లా వ్యాప్తంగా పలు గిరిజన సంఘాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకునేందుకు సన్నాహాలు చేసుకున్నారు.

### మూలవాసులకు ముప్పు...

మానవ మనుగడు విలసిల్లడానికి మూలవాసులుగా పిలువబడే సంతతికి నేడు పెను ముప్పు ముంచుకొస్తోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఆదివాసీల పిట్టినిల్లులు జల సమాధి కాబోతున్నాయి. వేలాది ఎకరాల అడవి, భూములు, నివాసాలు, జీవనవిధానం కనుమరుగుకానుంది. ప్రధానంగా భద్రాచలం ఏజెన్సీలో పెద్ద ఎత్తున కోయ, కొండరెడ్ల తెగలు నివశిస్తున్నాయి. ఏపిలోని చింతూరు, విఆర్ పురం,కూనవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఉండే కోయ, కొండరెడ్లు పోలవరం ప్రాజెక్టు పూర్తయితే వారి జీవించే అడవులను వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవాల్సిందే. ప్రాజెక్టు కారణంగా దట్టమైన అడవులతో పాటు ప్రత్యేక ఆచార వ్యవహారాలు గల ఆదివాసీల మనుగడు ప్రశ్నార్థకంగా మారనుంది. భద్రాచలం నుండి మొదుకుని ఆదిలాబాద్ వరకు మూల వాసులు పెద్ద ఎత్తున జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు ఏకాంత జీవనంతో ముందుకు సాగిన వారు ఇప్పుడిప్పుడే బాహ్య ప్రపంచంలోనికి అడుగులు పెడుతున్నారు.

### ఐటిడిఏ ఆధ్వర్యంలో...

ఐటిడిఏ ఆధ్వర్యంల ఆదివాసీ దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో జరిపేందుకు ఏర్పాటు చేశారు. భద్రాచలం పురవీధులన్నీ నేడు కొమ్ము కోయ, నృత్యాలు, డప్పువాయిధ్యాలు, ప్రత్యేక వస్రధారణలు కనివిందు చేయనున్నాయి. రేలపాటలతో ఆదివాసీల పురిటి గడ్డ ఆకుపచ్చని పసిడి కాంతులను వెదల్లనుంది. ఈ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కన్నులారా తిలకించేందుకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన,చదువుకుంటున్న వారు తరలివస్తున్నారు. ఐటిడిఏ కార్యాలయంలో విద్యార్థినీ విద్యార్థులచే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

# విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికై నిరంతర సేవలందిస్తున్నాం..



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కొరకు నిరంతర సేవలు అందిస్తూ, ప్రభుత్వ పరంగా రావలసిన బకాయిల కొరకు దశలవారీగా ఉద్యమాలు నిర్వర్తిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వనమారెడ్డి చెంచిరెడ్డి, సత్తుపల్లి యూనిట్ ప్రధాన కార్యదర్శి బద్రుద్దీన్ అన్నారు.శుక్రవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులకు జిల్లా సంక్షేమశాఖ గుర్తింపు కార్డులను 175 మందికి ఉచితంగా సంఘ పక్షాన అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన వారికి బకాయిలను సకాలంలో చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందన్నారు. ఈ కార్యక్రమంలో చెంచిరెడ్డి, బద్రుద్దీన్ లతో పాటు జిల్లా, మండల యూనిట్ నాయకులు ఏయస్.ప్రకాశరావు, అద్దంకి వెంకటరత్నం, డి.కృష్ణయ్య, సాంబశివరెడ్డి, వి.వెంకటరత్నం, మల్లికార్జున రావు, జి.కృష్ణయ్య, బూరుగు దాసు, మధుసూదన రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాలకు ఎర్తింగ్‌తో చెక్





**-షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా నివారణ**
**-ఆర్‌సిసిబి, ఎంసిబిలతో కరెంట్ లీకులకు అడ్డుకట్ట**
**-ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి : ఏఈ సుందర్‌కుమార్**

**ప్రజాపక్షం/వైరా :** విద్యుత్ ప్రమాదాలకు ఎర్తింగ్‌తో చెక్ పెట్టవచ్చునని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి నివాసాలు కట్టుకుంటారు. లక్షల రూపాయలు విద్యుత్ కోసం ఖర్చు పెడతారు. కానీ విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలను ఎవరు పెద్దగా పట్టించుకోరు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే పెద్ద ఎత్తున ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం కూడా జరుగుతుంది. అందువల్ల విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం షాపులు, ఇండ్లు, భవనాలు నిర్మించే సందర్భంలో వాటికి తగిన సామర్థ్యంతో గల ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ అధికారులు పదే పదే చెబుతున్నారు. విద్యుత్ ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు ప్రతి భవనానికి ఎర్త్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలనే నిబంధనలు ఉన్నాయి. విద్యుత్ ఎర్తింగ్ ముఖ్యంగా మూడు రకాలుగా ఉంటాయి. ఒకటి పైపు ఎర్తింగ్, ప్లేట్ ఎర్తింగ్, స్ట్రీప్ ఎర్తింగ్ వీటితో పాటు న్యూట్రల్ ఎర్తింగ్ కూడా ఉంటుంది. భవనాలకు ఎక్కువ శాతం ఎర్తింగ్ పాయింట్లు లేవని అధికారులు చెబుతున్నారు. ఇండ్లలో వినియోగించే విద్యుత్ సామర్థ్యం ఆధారంగా ఎర్తింగ్ పాయింట్‌లు ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని ఎలక్ట్రికల్ సర్క్యూట్లను భూమికి అనుసంధానం చేస్తూ పైపు ఎర్తింగ్, ప్లేట్ ఎర్తింగ్‌లతో భవనాలకు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చునని అధికారులు సూచిస్తున్నారు.

### ఎంసిబి, ఆర్‌సిసిబిలు :

కరెంటు సరఫరాలో లీకేజీలను అరికట్టేందుకు మినీ మేయర్ సర్క్యూట్ బ్రేకర్ (ఎంసిబి) ప్రతి ఇంట్లో ఏర్పాటు చేసుకోవాలి. రెండు ఫేజ్‌లు కలిగి ఉన్నప్పుడు విద్యుత్ సరఫరాలో ఓల్టేజ్ హెచ్చుతగ్గులు తలేత్తినప్పుడు ఎంసిబి వెంటనే ట్రిప్ అయి కరెంటు సరఫరా నిలిచిపోతుంది. ఇండ్లలో మెట్రో కరెంట్ ఇన్సులేటర్ లీకేజీలను అరికట్టేందుకు రెద్యువల్ కరెంట్ సర్క్యూట్ బ్రేకర్ (ఆర్‌సిసిబి) ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇండ్లకు చాలా వరకు ఆర్‌సిసిబిలు ఏర్పాటు చేసుకోవడం లేదు. అలా చేసుకుంటే షార్ట్ సర్క్యూట్ అయితే వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

### పైప్ ఎర్తింగ్ :

పైప్ ఎర్తింగ్ కోసం 38 మిల్లీ మీటర్ల వ్యాసం, రెండు మీటర్ల పొడవు గల పైపును సాధారణంగా ఉపయోగిస్తారు. ఈ పైపును 2 నుంచి మూడు మీటర్ల లోతులో భూమిలో పాతిపెడతారు. భూమిలో పెట్టిన పైపు చుట్టురా బొగ్గు, కల్లుఉప్పు వేసి తేమను నిలుపుకోవడం ద్వారా ఎర్త్ రెసిస్టెను తగ్గిస్తారు. పైప్ ఎర్తింగ్ ఇంటి విద్యుత్ వ్యవస్థలు, పారిశ్రామిక విద్యుత్ వ్యవస్థలు ట్రాన్స్ మీటర్ టవర్ల వంటి వివిధ అనువర్తనాలలో వీటిని ఉపయోగిస్తారు. ముఖ్యంగా తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలకు, తేమ తక్కువగా ఉన్న ప్రాంతాలకు ఈ విధానం అనుకూలంగా ఉంటుంది. ఇది తక్కువ ఖర్చుతో కూడుకున్న విద్యుత్ షాక్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది.

### ప్లేట్ ఎర్తింగ్ :

ప్లేట్ ఎర్తింగ్ పద్దతిలో కొలతల ప్రకారం కలిగిన ప్లేట్లను తీసుకుని భూమిలో లోతుగా పెడతారు. దీనిలో 6.3 మిల్లీ మీటర్లు లేదా 3.15 మందం గల గాల్వనైజ్ స్టీల్ ప్లేట్ లేదా రాగి ప్లేట్లను ఉపయోగిస్తారు. ఈ ప్లేట్లు గుంటలో నిలువుగా ఉంచి గుంట చుట్టూ బొగ్గు, కల్లుఉప్పు వేసి ఎర్త్ వేరును కనెక్ట్ చేస్తారు. అనంతరం గుంటను పూడుస్తారు. దీని ద్వారా విద్యుత్ షాక్ ప్రమాదాన్ని తగ్గించి ఎలక్ట్రికల్ పరికరాలను సురక్షితంగా ఉంచుతుంది.

### స్ట్రీప్ ఎర్తింగ్ :

స్ట్రీప్ ఎర్తింగ్ అనేది తక్కువ నిరోధకత కలిగిన మెటాలిక్ స్ట్రీప్ ద్వారా విద్యుత్ ఉపకరణల నుంచి భూమికి విద్యుత్‌ను ప్రసారం చేసే ప్రక్రియ ఈ ఎర్తింగ్ కోసం గాల్వనైజ్ లేదా కాపర్ స్ట్రీప్‌లను ఉపయోగిస్తారు. ఏదైనా విద్యుత్ లోపం సంభవించినప్పుడు అధిక విద్యుత్ ప్రవాహం ఎర్తింగ్ సిస్టంలోకి వెళ్తుంది. ఈ సిస్టం ఎర్తింగ్ ద్వారా విద్యుత్ ప్రవాహం భూమిలోకి సురక్షితంగా ప్రవహించి విద్యుత్ షాక్ ప్రమాదాలను తగ్గిస్తుంది.

### ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి : ఏఈ సుందర్‌కుమార్



ప్రతి ఒక్కరూ ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని వైరా ఏఈ సుందర్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తాయి. గృహాల్లోని ఏసిలు, గీజర్లు ఏర్పాటు చేసుకుంటున్న భవనాలకు ఎర్తింగ్ ఉందా లేదా అనేది ఎవరు పట్టించుకోవడం లేదు. ఏసిలు, గీజర్లు, వాషింగ్ మిషన్, ఓవెన్లు లాంటివి ఉన్న ఇంట్లో తప్పనిసరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. ఇలా ఎర్త్ ఏర్పాటు చేసుకోవడం వల్ల 90 శాతం విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అరికట్టవచ్చును. ప్రజలు ముఖ్యంగా భవన నిర్మాణాలు చేపట్టేటప్పుడు, ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేటప్పుడు ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని వైరా ఏఈ సుందర్‌కుమార్ సూచించారు.

# ఘనంగా సెంట్రల్‌బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల సెంట్రల్‌బ్యాంకులో 144వ ఆవిర్భావదినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై ఏర్పాటు చేసిన బ్యాంక్ ఫౌండర్ సొరాబ్జీ పోచ్‌ఖానావాల చిత్రపటానికి పూల మాలలు వేశారు. అలాగే బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది కొబ్బరికాయలు కొట్టి, పూలమాలలు వేసి చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ స్వాతి, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీమాన్, అభిషేక్, క్యాషియర్ సోనీ, క్లర్క్ నిర్మల, బ్యాంక్ సిబ్బంది ఆనంద్, వంశీ, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, 28వ డివిజన్ సిపిఐ కార్యదర్శి లగిశెట్టి రమేష్, 29 డివిజన్ ఏఐవైఎఫ్ కార్యదర్శి మిర్యాల నరుణ్‌తేజ్, సిపిఐ నాయకులు కొనకటి అశోక్‌రెడ్డి, రంజిత్‌కుమార్, వంశీ, బబుతరాం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# డివిఎస్‌కు పలువురి అభినందనలు



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కళామా తల్లి ముద్దుబిడ్డ వైరాకు చెందిన ప్రముఖ సినీ నిర్మాత డివిఎస్‌ను నెలనెలా వెన్నెల 8వ వార్షికోత్సవం సందర్భంగా ఖమ్మ ం కళాపరిషత్ డాక్టర్ నాబత్తిని రవి ఆధ్వర్యంలో ఘనమైన ఆత్మీయ సన్మానం నిర్వహించారు. వైరా నుండి డివిఎస్‌ను అభినందించడానికి వచ్చిన మిత్రులు షేక్ సోందు, డి.కుటుంబరావు, నాగబత్తిని భాస్కర్‌రావు, ఐజె రెడ్డి, చెరుకుమల్లి వెంకటేశ్వరరావు, షేక్ పాషా ఈ కార్యక్రమానికి హాజరై డివిఎస్‌ను అభినందించారు.

# క్విట్ ఇండియా ఉద్యమం భారతదేశ స్వాతంత్ర్యానికి కీలక మలుపు



**ప్రజాపక్షం/వైరా:** భారతదేశానికి స్వాతంత్ర్యం రావడంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలకమైందని స్థానిక వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. శుక్రవారం ఆగస్ట్8 క్విట్ ఇండియా ఉద్యమ ప్రకటన సందర్భంగా స్థానిక కళాశాలలో ఇంచార్జి ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశంలో బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా 1942 ఆగస్ట్8న దేశవ్యాప్తంగా క్విట్ ఇంటియా ఉద్యమం ప్రారంభించడం జరిగిందని తెలుపుతూ ఈ ఉద్యమంలో భారతీయులు స్వతంత్ర్యం కొరకు డూ ఆర్ డై నినాదంతో పెద్ద ఎత్తున స్వతంత్ర్యం ఉద్యమం నిర్వహించడం జరిగిందని తెలుపుతూ ఇక్కడ జరుగుతున్న ఉద్యమాన్ని బ్రిటీష్ ప్రభుత్వం క్రూరంగా అనిచివేయడానికి ప్రయత్నం చేసిందని, స్వతంత్ర్య ఉద్యమ నాయకులను అరెస్ట్ చేయడం జరిగిందని, అయినప్పటికి ప్రజలు అరెస్టులకు భయపడకుండా ఉద్యమ ం నిర్వహించారని తెలిపారు. ఈ పోరాటాలను గమనించి బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశ స్వతంత్ర్యం ఇవ్వడానికి ముందుకు వచ్చిందని తెలిపారు. విద్యార్థులు అందరూ కూడా స్వతంత్ర్య ఉద్యమ లక్ష్యాలను గమనించి తమ చదువులు కొనసాగిస్తూ తమ అభివృద్ధికి దేశ అభివృద్ధికి కృషి చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా వరలక్ష్మీ వ్రతం

**-గ్రామాల్లో ప్రతి ఇంట్లో లక్ష్మీ దేవి ప్రతిమలు**
**-భక్తులతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు**




**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలంలో శుక్రవారం వైభవంగా ప్రజలు వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో లక్ష్మీ దేవి ప్రతిమలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన పండ్లు, పువ్వులు, పిండి వంటకాలు పెట్టి పూజించారు. సామూహిక వరలక్ష్మీ వేడుకల్లో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మహాలక్ష్మి అమ్మవారికి అష్టో త్తర శతనామ కుంకుమార్చన చేశారు. మహిళలంతా వరాలిచ్చే మహాలక్ష్మి మమ్మల్ని చల్లగా చూసివరాలు ఇమ్మని వేడుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రతి ఇంటా సిరిసంపదలు చేకూరుతాయని నిర్వహించే వరలక్ష్మి వ్రతం మండల పరిధిలో శుక్రవారం వైభవంగా జరిగాయి. మండలంలోని ఇళ్లలో మొదదలుకొని గ్రామాల్లో అంతటా ఆలయాల్లోభక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. అమ్మవారికి స్వాగత సూచికగా ఇళ్లముందు మహిళమణులు ముగ్గులు పెట్టి, మామిడితోరణాలతో వరలక్ష్మి కి ఘనస్వాగతం పలికారు. మహిళలు మహాలక్ష్మి దేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, వరలక్ష్మి వ్రతమహా తెలుసుకున్నారు. ముత్తైదువులకు వాయనాలు ఇచ్చి పది కాలాల పాటు సుమంగళిగా ఉండే విధంగా ఆశీస్సులు అందుకున్నారు. వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని మహిళ మణులు ఉదయం నుంచే పూజాది కార్యక్రమాలకు ఉపక్రమించారు. కాగా, స్థానిక ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. పలువురు మహిళలు, పిల్లలు, కుటుంబ సమేతంగా ఈ పండుగ వాతావరణం వేడుకల్లో పాల్గొన్నారు.

### వరలక్ష్మీ వ్రతం ప్రత్యేకత...

లక్ష్మీ దేవి సంపద, ఐశ్వర్యం, శ్రేయస్సు, అదృష్టానికి ఆధి దేవత. ఈ రోజు వరలక్ష్మీ వ్రతం పండుగ.. అంటే సంపద దేవత అయిన లక్ష్మీ దేవిని పూజించే రోజు. ముఖ్యంగా మహిళలు ఈ ఆచారాన్ని ఆచరిస్తారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో వరమహాలక్ష్మి వేడుకను జరుపుకుంటారు. వరలక్ష్మీ వ్రతం అనేది శ్రేయస్సు, ఐశ్వర్యం, సంపద కోసం లక్ష్మీ దేవిని పూజించే ఒక ముఖ్యమైన పండుగ. ఇది శ్రావణమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం నాడు జరుపుకుంటారు. ఈ వ్రతం లక్ష్మీ దేవిని సంతోషపెట్టడానికి, ఆమె అనుగ్రహాన్ని పొందడానికి చేస్తారు. వివాహిత మహిళలు ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల వారు జీవితాంతం సుమంగళిగా ఉంటారని నమ్ముతారు. అంటే, వారు తమ భర్తలతో సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటారని భావిస్తారు.

# మంత్రి పొంగులేటి అభిమానిపై కత్తితో దాడి

**- బాధితుడిని పరామర్శించిన తుంబూరు దయాకర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అభిమానిపై ఓ యువకుడు కత్తితో దాడి చేసిన సంఘటనపై ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసునమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సాయిగణేష్‌నగర్‌రోడ్ నెంబర్ 8కి చెందిన గుడిపెల్లి సుదర్శన్ రోడ్ నెంబర్9లోని వెంకటేశ్వర సూపర్‌మార్కెట్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో మిడకంటి రాజవర్ధన్‌రెడ్డి అనే యువకుడు మెరుగు భాస్కర్‌పై చేయిచేసుకున్నాడు. దీనిని అడిగినందుకు నువ్వు నన్ను అడుగుతావా? అంటు బూతులు తిట్టుకుంటూ చాకుతో దాడి చేశాడు. ఛాతీపైన పొట్టకు ఇరువైపుల వీపు మీద మూడుచోట్ల గాయాలై తీవ్ర రక్తస్రావం అయ్యింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తరలించి చికిత్సను అందిస్తున్నారు. గాయపడిన వ్యక్తి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు డాక్టర్ తెలిపారు. ఈ ఘటనపై భార్య విమల ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సర్కిల్‌ఇన్స్‌పెక్టర్ ముష్కరాజు తెలిపారు.

### గాయపడిన వ్యక్తిని పరామర్శించిన దయాకర్‌రెడ్డి...

ఖమ్మం నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సుదర్శన్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ని అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు.

## సర్వజ్ఞలో వరలక్ష్మీవ్రతం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతంను అత్యంత భక్తిశ్రద్ధలతో విద్యార్థులు జరుపుకున్నారు. పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. పాఠశాల కరస్పాండెంట్ నీలిమ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో పూజలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై అమ్మవారిని ప్రతిష్టించి పూలు, పండ్లు, పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థినులు శ్లోకాలు పఠిస్తూ, పాటలు పాడుతూ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలిచారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్ నీలిమ, ఆర్వి నాగేంద్రకుమార్ లు మాట్లాడుతూ శ్రావణమాసం అంటేనే పూజల సందడి అని మహిళలు ఈనెల అంతా భక్తి భావంతో, పూజలతో ఉపవాసాలు చేస్తారని తెలిపారు. శ్రావణ మాసం రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం చేసుకుంటారన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో పాఠశాలల పాత్ర ఎంతో కీలకమన్నారు. వరలక్ష్మీ వత్రం వంటి పండుగలు విద్యార్థులకు ఆధ్యాత్మిక విలువలను నేర్పుతాయన్నారు. విద్యతో పాటు సంస్కారవంతమైన జీవితాన్ని అలవర్చుకోవాలని వారు కోరారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగులు నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండల సెక్టార్లో ఆగస్టు 11 నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజవయంతం చేయాలని టాస్క్‌ఫోర్స్ అధికారి ఎంపిడిఓ బి.వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అధికారులు ఆగస్టు 11 సోమవారం నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో, పట్టణాల్లో అంగన్వాడీలు, పాఠశాలల నందు 1 నుండి 19 సంవత్సరాలలోపు పిల్లలకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు వయస్సుల వారీగా పారా మెడికల్ సిబ్బంది సహకారంతో వేయాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలు వేయించే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ పృధ్వీరాజ్, సిడిపిఓ బాలత్రిపురసుందరిదేవి, ఎంఇఓ వై.ప్రభాకర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు, హెచ్ఇఓ శరత్‌బాబు, ఇతర సూపర్‌వైజర్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర నియోజకవర్గంలో ఈ నెల 10వ తేదీన డిప్యూటీ సిఎం మల్లుభట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం పురుషోత్తమకుమార్ తదితరులు పర్యటించనున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ తెలిపారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వంగవీడు గ్రామంలో రూ.630కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మంత్రుల పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అధికసంఖ్యలో అభిమానులు, ప్రజలు, అనుబంధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం



**ప్రజాపక్షం/ మధిర :** శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతం వేడుకలను మధిర పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు శ్రావణమాస ఉత్సవాలు సందర్భంగా వరలక్ష్మీ వ్రతం పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం మూడవ శుక్రవారం కావటంతో మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీమాన్ శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళా భక్తులు తమ ఇండ్లల్లో వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించి మహాలక్ష్మీ అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సైపై కోటి రూపాయల పరువునష్టం దావా

- సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ పరువు నష్టం దాఖలు చేసిన బాధితులు
-ఆ భూమి వారసుడుకే చెందుతుందని సుప్రీంకోర్టు తుది తీర్పు వెల్లడి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మనిషి జన్మించిన అనంతరం తాను చేసే పనులు వల్ల కర్మఫలం వృధి చెందుతూ తమ కుటంబీకులకు వర్తిస్తుందని శాస్త్రం గోషిస్తుంది అలాంటి సంఘటన మండల పరిధిలోని తిరుమలాయపాలెంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన మద్దినేని వెంకటేశ్వర్లు కుమారుడు శ్రవణ్‌కుమార్ చేసిన భూపోరాట ఫలితంగా సుప్రీంకోర్టు తుది తీర్పుతో 18 సంవత్సరాల నిరీక్షణకు తెరపడింది. తన తాత భూమి అక్రమంగా అన్యాయంగా దౌర్జన్యంగా తప్పుడు ధృవ పత్రాలు సృష్టించి ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఓం నారాయణ ఖండిల్వాల్ మద్దినేని రంగయ్య వారసత్వ పట్టా భూమి ఖమ్మం వరంగల్ జాతీయ రహదారి పక్కన తిరుమలాయపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 246/ఇలో విస్తీర్ణం రెండు ఎకరాల 33 కుంటల భూమిని పిండిప్రోలు గ్రామానికి చెందిన కాంపాటి వెంకటేశ్వర్లు భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తుండగా భూమి హక్కుదారుడు మద్దినేని పెంటయ్య మృతి చెందడంతో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి మద్దిని రంగయ్య భూమి విక్రయించినట్లు ఫోర్జరీ సంతకాలతో పత్రాలు సృష్టించారు. ఆ భూమిని ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ మార్బుల్ వ్యాపారవేత్త ఓం నారాయణ ఖండల్వాల్‌కు కౌలుదారుడు కాంపాటి వెంకటేశ్వర్లు విక్రయించగా దానికి అప్పటి తహశీల్దార్ పోలీసులు, పంచాయతీరాజ్ అధికారులకు గ్రామ పెద్దలు మార్బుల్ వ్యాపారవేత్త అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని అతనికి సపోర్ట్ చేయడంతో న్యాయ పోరాటానికి దిగిన మద్దినేని శ్రావణ్‌కుమార్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఎలాగైనా అక్రమ పద్ధతిలో భూమిని దగ్గించుకోవాలని ఓం నారాయణ ఖండేల్వాల్ 2014లో స్థానిక తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో మద్దినేని వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్‌పై తప్పుడు ఫిర్యాదు చేశాడు.అప్పటిలో అందరి రాజకీయవేత్తలు ఆ వ్యాపార వేత్తకి సపోర్ట్ చేయటంతో ఎస్సై ఓంకార్ యాదవ్ మద్దినేని వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశాడు. ఈ క్రమంలో మద్దినేని శ్రావణ్‌కుమార్ అప్పటికే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదివి అక్కడే ఉద్యోగం చేద్దామని భావించిన అతని ఆశలు ఆడియాశలయ్యాయి. దీనికి తోడు ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. క్రిమినల్ కేసు నమోదు చేయటం వల్ల విదేశాలకు వెళ్లే ప్రయత్నం ఆగిపోయింది. చివరికి భూమిపై న్యాయపోరాటానికి దిగిన శ్రావణ్‌కుమార్ తన తాత భూమి వారసత్వంగా తనకే చెందుతుందని 2007లో కోర్టుని ఆశ్రయించగా జిల్లా కోర్టు 2013లో మద్దినేని శ్రావణ్‌కుమార్‌కి అనుకూల తీర్పు ఇచ్చింది. దాన్ని సవాల్ చేస్తూ ఓంనారాయణ ఖండేల్వాల్ హైకోర్టును ఆశ్రయించగా 2023లో శ్రావణ్‌కుమార్‌కు హైకోర్టు కూడా అనుకూల తీర్పు ఇచ్చింది. దాన్ని సవాల్ చేసిన ఓం నారాయణ ఖండేల్వాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. కింది కోర్టు తీర్పులను పరిశీలించిన సుప్రీం కోర్టు 2024 డిసెంబర్ 19న ఆ భూమి వారసుడైన మద్దినేని శ్రావణ్‌కుమార్‌కి చెందుతుందని తుది తీర్పు ఇవ్వటంతో 18ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించిన భూ పోరాట బాధితులు మద్దినేని వెంకటేశ్వర్లు, కుమారు మద్దినేని శ్రావణ్‌కుమార్ క్రిమినల్ కేసు పెట్టి సమాజంలో పరువుతో పాటు ఉన్నత విద్యను విదేశాల ప్రయాణాన్ని నిలుపుదల చేసి ఆర్థికంగా ఇబ్బందులు పెట్టిన వ్యాపారవేత్త ఓం నారాయణ ఖండేల్వాల్‌పై కేసు నమోదు చేసిన ఎస్సై ఓంకార్ యాదవ్‌పై కోటి రూపాయలకు పరువు నష్టం కోర్టు దాఖలు చేయగా ఇటీవలే కోర్టు వారి పరిజ్ఞానంలో తీసుకుని పరిశీలిస్తున్నారు. సంబంధిత ఎస్సైకు, వ్యాపార వేత్తకు సమన్లు జారీ చేసినట్లు తెలిసింది.

## కొత్తగూడెం ఏరియాలో పర్యటించిన చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం ఏరియాలోని కిష్టారం ఓసి, జెవిఆర్ ఓసి, జెవిఆర్ సిహెచ్‌పి కొత్తగూడెం జిఎం కార్యాలయం నందు వివిధ విభాగాధిపతులతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బాధావత్ వెంకన్న, ఐఆర్ టిఎస్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సింగరేణి నందు బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా కొత్తగూడెం ఏరియాను సందర్శించడం జరిగింది. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు కొత్తగూడెం ఏరియా తరపున పూల మొక్క శాలువాతో ఘనంగా స్వాగతించారు. అనంతరం కిష్టారం ఓసీ అలాగే జేవిఆర్ఓసి ఉపరితల గనుల యొక్క మ్యాపుల ద్వారా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సంబంధిత ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఉపరితల గనుల యొక్క వివరాలను వివరించారు. ఈ సందర్భంగా జిఎం నూతనంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టు వికే ఓ.సి ఉపరితల మైన్ వివరాలను, వాటి యొక్క రికార్డులను వివరించారు. కిష్టారం ఓసీ, జెవిఆర్ ఓ.సిలను సందర్శించి వ్యూ పాయింట్ నుండి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించి అక్కడ జరుగుతున్న రోజు వారి బొగ్గు ఉత్పత్తి రవాణా, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జి.ఎం ఎం.షాలేం రాజును అడిగి తెలుసుకున్నారు. బొగ్గు యొక్క నాణ్యతను పరిశీలించి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని, బొగ్గు ఉత్పత్తి రవాణా రోజు వారి లక్ష్యాలను అధికమించి రవాణాకు ఎటువంటి ఆటంకములు కలుగకుండా ముందస్తు జాగ్రతలతో బొగ్గు నాణ్యత సామర్థం ఉత్పతి ఐయే లాగా చూడాలని అలాగే ఉపరితల గనుల్లో ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలతో బొగ్గు ఉత్పత్తి తీయాలని సూచించారు. అనంతరం కిష్టారం ఓసి జేవిఆర్ ఓసిల నందు ప్లాంటేషన్ చేశారు. జెవిఆర్ సి.హెచ్.పి లోడింగ్ పాయింట్ ను సందర్శించి సి.హెచ్. పి నందు రైలు మార్గం ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణా గురించి, సైలో బంకర్ నుండి దుమ్ము ధూళి వెలువడకుండా తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. బొగ్గు యొక్క గ్రేడ్ లను పరిశీలించి నాణ్యమైన బొగ్గును సరఫరాచేయాలనీ సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం వారు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల శాఖాధిపతులు, అధికారులు వారిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి, సంస్థ పురోభివృద్ధిలో భాగస్తులు అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎస్ఓటు జిఎం జి.వి. కోటి రెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్యనారాయణ రాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జేవిఆర్ ఓసి ఎన్‌విఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసి ఎంవి.నరసింహారావు, జేవిఆర్ సిహెచ్‌పి డీజీఎం ఈఎం కె.సోమశేఖర్, డీజీఎం పర్సనల్ జి.వి. మోహన్ రావు, డీజీఎం ఐఈడి ఎన్.యోహాన్ కొత్తగూడెం ఏరియా ఇతర విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాల డిపెండెంట్ కమిటీ సభ్యులతో కౌన్సిలింగ్



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం ఏరియా జియంఎం. షాలేం రాజు ఆదేశాల మేరకు కారుణ్య నియామకాల కొరకు పద్మావతి ఖని మైన్ ఏరియా వర్క్ షాప్ నందు విధులు నిర్వహిస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన మరణించిన ఉద్యోగుల వారసులు ఎనిమిది మందికి పద్మావతి ఖని ఏజెంట్ కార్యాలయంలో ఏరియా లెవెల్ డిపెండెంట్ కమిటీ సభ్యులతో కౌన్సిలింగ్ వారి కుటుంబ సభ్యుల సాక్షుల సమక్షంలో నిర్వహించి అన్నివివరాలు నమోదు చేసి కౌన్సిలింగ్ పూర్తి అయిన తరువాత అందరిని వైద్యపరీక్షల కొరకు పంపించి కంపెనీ నియమ నిబంధనలు అనుసరించి వారికి నియామక ఉత్తర్వులు అందజేయడం జరుగుతుంద అని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మావతి ఖని ఏజెంట్ రామ్ భరోస్ మహతో, డి.జి.యం. పర్సనల్ గామలపాటి వెంకట మోహన్ రావు, డిజిఎం ఈఎం, ఏరియా వర్క్ షాప్ టి.శ్రీకాంత్, పద్మావతి ఖని మైన్ మేనేజర్ ఎం.వి.ఎన్. శ్యాంప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్లు మజ్జి మురళి, జి.సంఘమిత్ర, పద్మావతి ఖని సంక్షేమ అధికారి ఎం.డి.షకీల్ సంబంధిత క్లర్క్ అల్లి విల్సన్, కొత్తపల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం..!

-జాప్యం లేకుండా బిల్లులు
-నిత్యం అధికారుల పర్యవేక్షణ





**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చురుగ్గా కొనసాగుతున్నాయి. ఎంపీడీఓ, హౌసింగ్ ఏఇ నిత్యం పర్యవేక్షణ చేస్తూ నాణ్యత ప్రాణమాలు పాటించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పునాది పూర్తి అయిన వెంటనే లబ్ధిదారుల ఖాతా లో బిల్లులు జమ చేయటం జరుగుతుందా లేదా అని పరిశీలించి ఇంటి నిర్మాణం కొనసాగేలా పర్యవేక్షిస్తున్నారు. మండలంలో మొత్తం 616 మంజూరు కాగా 562 మార్కింగ్ ఇచ్చారు అధికారులు. 517 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇందులో 86 ఇళ్లు స్లాబ్ లెవల్ కాగా 25 స్లాబులు వేశారు. మిగిలిన ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటి వరకు బిల్లులు 498 ఇళ్లకు నిధులు లబ్ధిదారుల ఖాతా జమ చేశారు. బిల్లులు దశల వారీగా జమ చేస్తున్నారు. పునాది పూర్తి కాగానే లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతా లో రూ లక్ష జమ చేస్తున్నారు. స్లాబు లెవల్ సెంట్రింగ్ ఏర్పాటు చేసిన తరువాత మరో రూ లక్ష జమ చేస్తున్నారు. స్లాబ్ అనంతరం రూ రెండు లక్షలు, పూర్తి అయిన తరువాత రూ లక్ష మొత్తం లబ్ధిదారుల ఖాతాలో ఐదు లక్షలు జమ చేస్తున్నారు. ఒక్క పైసా చేతివాటం లేకుండా, అవినీతికి ఆస్కారం లేకుండ నేరుగా లబ్ధిదారుల కు బిల్లులు చేరుతున్నాయి. గతంలో ఇందిరమ్మ ఇళ్లు అంటే అందిన కాడికి చేతి వాటం, ప్రతి బిల్లుకు లంచం అవినీతి అంటేనే గృహనిర్మాణ శాఖ అని ప్రజలు చెప్పుకునేవారు. నేడు అలాంటి వాటికి ఆస్కారం లేకుండా అధికారులు తగుచర్యలు తీసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరులో అక్కడిక్కడ కొందరు చేతివాటం ప్రధర్శించారనే ఆరోపణలు వినవచ్చాయి. అయినా దాళారులను నమ్మొద్దు, అవినీతికి ఆస్కారం వద్దు అని సత్తుపల్లి యంయల్ఏ మట్టా రాగమయి దయానంద్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వటం తో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం దిగ్విజయంగా జరుగుతుందని ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం అంటే కాంగ్రెస్ అనే నాణుడి నిజం చేసిన ఘనత సియం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది.

# పెనుభారంలా మొక్కల సంరక్షణ..!

-వేతనాన్ని సైతం ఖర్చుచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు
-20నెలల నుంచి నిధులు లేక
అప్పుల పాలవుతున్న కార్యదర్శులు






**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** సుమారు 20నెలలుగా గ్రామపంచాయతీలో నిధులు లేక పంచాయతీ కార్యదర్శులు అష్టకష్టాలు పడుతూ తమ కుటుంబ అవసరాలను తీర్చలేక గ్రామపంచాయతీలో పనులు చేయించలేక ఇబ్బందులు పడుతూ అప్పుల పాలవుతున్నారని కొందరు కార్యదర్శులు వాపోతున్నారు. దీనికి తోడు గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మొక్కలు సంరక్షణ ఎంతో ఇబ్బందిగా ఉందని మేజర్ గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్స్ ఎక్కువ సంఖ్యలో ఉండటం కొంత వారికి అనుకూలంగా ఉన్న చిన్న గ్రామపంచాతీలో ఒకరు ట్రాక్టర్ డ్రైవర్ ఒకరు నీటి పంపులు వదిలే వాడు ఒక గుమ్మస్తా ఉంటే నాటిన మొక్కల సంరక్షణ చేయాలంటే వ్యవసాయ కూలీలను పెట్టి చేపిస్తే ఒక్కొక్కరికి రోజుకి రూ.500 చొప్పన కూలీ ఇవ్వాల్సి వస్తుందని కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో నిధులు లేక మా వేతనాలను గ్రామపంచాయతీలకే ఖర్చు చేస్తున్నామని అవి సరిపోకపోతే వడ్డీ వ్యాపారస్తుల వద్ద డబ్బులు వడ్డీకి తెచ్చి పంచాయతీ పనులు చేపిస్తున్నామని ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఈజిఎస్ ద్వారా గ్రామాల్లో ప్రధాన రహదారి ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణ కోసం చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటడం పెనుభారంగా మారిందని కార్యదర్శులు విన్నవించుకుంటున్నారు. చిన్న గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్ లేక పనులు చేయించాలంటే ఇబ్బందులు పడుతున్నామని, అసలే వర్షాకాలం గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు మొక్కల సంరక్షణ భారంగా ఉందని, పేరుకే ప్రభుత్వం ఉద్యోగం కాని విధి నిర్వహణలో అష్టకష్టాలు పని ఒత్తిడి ఎక్కువగా ఉందని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, డిపిఓ స్పందించి కార్యదర్శుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## భూ భారతి దరఖాస్తులు దశలవారీగా పరిష్కారం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలంలో గత నెలలో నిర్వహించిన భూ భారతి గ్రామ సభల ద్వారా వచ్చిన దరఖాస్తు లను క్షుణ్ణంగా పరిశీలించి దశల వారీగా పరిష్కరిస్తామని పెనుబల్లి తహశీల్దార్ ఆర్. నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం తహశీల్దార్ ''ప్రజాపక్షం''తో మాట్లాడుతూ పెనుబల్లి మండలంలోని 33 గ్రామ పంచాయతీలలో 15 రోజుల పాటు గత నెలలో నిర్వహించిన గ్రామ సభల ద్వారా 5,139 మంది భూభారతి ద్వారా దరఖాస్తులు వచ్చాయని, సాధా బైనామా కొరకు 3,175 దరఖాస్తులు అందాయని 2,600 దరఖాస్తులు ఆన్ లైన్ చేశామని, 2020 లో 630 దరఖాస్తులు ఉన్నాయి అని పిఓబికెయస్‌యస్ లో 711 దరఖాస్తు లు అందాయని, తమ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి రిజిస్టర్లో నమోదు చేయడం జరుగు తుందని, ముందుగా గ్రామాలలో నుంచి దరఖాస్తులలో మ్యూటేషన్, సక్సెషన్, నేమ్ కరెక్షన్ లాంటి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సభల ద్వారా దరఖా స్తులు అన్ని తమ వద్ద రిజిస్టర్ లో నమోదు చేయడం జరిగిందని, దరఖాస్తు దారులు ఎవ్వరూ అధైర్యపడవద్దని తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి దరఖాస్తు పరిష్కరిం చబడుతుందని తహశీల్దార్ తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో కొంత సిబ్బంది కొరత ఉందని, సిబ్బంది కొరత మూలంగా పనిఒత్తిడి ఎక్కువ అయిందని, అయినా ప్రజల సమస్యలు, రెవెన్యూ సమస్యలు పరిష్కారించడానికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తహశీల్దార్ ఆర్. నారాయణమూర్తి అన్నారు. భూభారతి దరఖాస్తు లు పరిశీలించి నోటీసులు సిద్ధం చేస్తున్నామని, జిల్లా అధికారులు ఆదేశాలు అందిన వెంటనే నోటీసులు జారీ చేస్తామని, సిబ్బంది మొత్తం భూభారతి పనుల్లో నిమఘ్నం అయ్యారని తహశీల్దార్ అన్నారు. భూభారతి లో భాగంగా పెనుబల్లి మండలానికి 21 మంది లైసెన్స్ కలిగిన సర్వేయర్లను శిక్షణ కొరకు కేటాయించారని శుక్రవారం విధుల్లో జాయిన్ అయ్యారని తహశీల్దార్ నారాయణ మూర్తి తెలిపారు.

## గుండెపోటుతో రాచకొండ శంకర్ మృతి





**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం సాంబయ్య గూడెం గ్రామానికి చెందిన రాచకొండ శంకర్ (చక్రయ) అయోధ్య గురువారం జరిగిన అయోధ్య అంత్యక్రియలో పాల్గొని, టపాసులు కాలుస్తూ డాన్సులు వేశాడు. అయోధ్య మరణం జీర్ణించుకోలేక, బోరున ఏడ్చాడు. ఇంటికి వెళ్లగానే గుండెపోటు రావడంతో వారిని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స రెడ్డి పుల్లారెడ్డి, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్, మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, మాజీ సర్పంచ్ బాడిస సతీష్ తదితరులు పాల్గొని ఎర్రజెండా కప్పి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. చక్రయకు ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చక్రయ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు ఎస్కే సర్వర్, పులిగల రమేష్, వేల్పుల నరేష్, భీమరాజు కృష్ణ , నోముల రవి, అలవాల అంజయ్య, కన్నెబోయిన ప్రసాద్, యనమల సుధాకర్, గోడిశాల వీరన్న, రంజిత్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## 10న కొత్తగూడెం సింగరేణి మెయిన్ హాస్పిటల్‌కు స్పెషలిస్టులు రాక

**ప్రజాపక్షం/మణుగూరు:** సంస్థ ప్రగతి కోసం కష్టించి పనిచేసే కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన అరోగ్య ప్రయోజనాలు అందించాలనే ఉద్దేశంతో సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగానే ఆగస్ట్ 10 వ తేదీ ఆదివారం కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ నందు హైదరాబాద్ రేనోవా హాస్పిటల్ నుంచి అత్యంత అనుభవజ్ఞులైన కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, యూరాలజిస్ట్ లకు చెందిన ప్రముఖ వైద్యులు రానున్నారని పై వైద్య సేవలు పొందదలచిన మణుగూరు ఏరియా కార్మికులు వారి కుటుంబ సభ్యులు నేటి శుక్రవారం నుంచి శనివారం సాయంత్రం వరకు మణుగూరు సింగరేణి ఏరియా హాస్పిటల్ నందు వారి వారి పేర్లను ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏరియా అధికార యంత్రాంగం తెలియజేసినందున ఈ అవకాశాన్ని అర్హులైన కార్మిక వారి కుటుంబ సభ్యులు సద్వినియం చేసుకొని పరిపూర్ణమైన ఆరోగ్యవంతులుగా ఉండాలని ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు.

## కరెంటు విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కరెంట్ విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు ట్రాన్స్‌కో ఏ.డి.ఈ ప్రసాద్ బాబు. శుక్రవారం మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలో విద్యుత్ షాక్ పై గ్రామస్తులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ బట్టలు ఆరేసుకునేందుకు నైలాన్ తాడును మాత్రమే ఉపయోగించాలని, ఇనుప తీగలను వాడితే విద్యుత్ షాక్ వచ్చే ప్రమాదం ఉందని, దాని వలన ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నైలాన్ తాడు వలన ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదాలు జరగవని, కరెంటు షాక్ లపై అవగాహన కల్పించారు. కరెంటు వైర్లు ఏమైనా డామేజ్ అయినా తొందరపడి ముట్టుకోవద్దని, ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని, కరెంటు విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దు అని, మనం తీసుకునే జాగ్రత్తలతో ప్రాణాలను నిలబెట్టుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ రామారావు, జూనియర్ లైన్ మెన్ చంద్రశేఖర్, గ్రామస్తులు తదితరులున్నారు.

## 11న నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఈ నెల 11వ, తేదీన జరిగే అంతర్జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. పాల్వంచ ఎంపిడిఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ .. రెండు నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి అల్బండజోల్ పూర్తి టాబ్లెట్ వేయాలన్నారు.రెండు సంవత్సరాల లోపు వయసు గల వారికి సగం టాబ్లెట్ ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు టాబ్లెట్ వేయటానికి తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. 11వ, తేదీన లేని విద్యార్థులను గుర్తించి తిరిగి 18వ, తేదీన వేయాలన్నారు. ఏ ఒక్క విద్యార్థికి కూడా మిస్ కాకుండా చూడాలన్నారు. దీనికి తగిన ప్రణాళిక తయారు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తహశీల్దార్ దారా ప్రసాద్, మండల విద్యాధికారి ఎం.శ్రీరామమూర్తి, సిడిపిఓ లక్ష్మి ప్రసన్న, వైద్యులు ప్రతాప్‌రాజు, క్రిష్ణ కుమారి, ప్రసాద్, నాగమణి, రామిరెడ్డి పాల్గొన్నారు.

# కాలువ పూడికతీత పనులు ప్రారంభం

**నీట మునిగిన పంట పొలాలు కథనానికి స్పందన**


నీట మునిగిన పంట పొలాలు

ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము నష్టపోతున్నామంటున్న రైతులు




ప్రజాపక్షం/సత్తుపల్లి: నీట మునిగిన పంట పొలాలు అనే శీర్షికన ఈ నెల 3న ప్రజాపక్షంలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం బేతుపల్లి పెద్ద చెరువు ప్రధాన కాలువలో జేసీబీ ద్వారా (పూడిక) మట్టి తొలగింపు చర్యలు చేపట్టారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ పూడిక తీత పనులను పర్యవేక్షించారు.పంట కాలువల శుభ్రత పనులు వేగంగా చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా, చివరి ఆయకట్టు రైతులకు సాఫీగా పంట సేద్యానికి నీరందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివా వేణు, కాంగ్రెస్ నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, బాల సత్యనారాయణ, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో వైద్యులంతా ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని వైద్య సేవలు అందించటంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాలేరు నియోజకవర్గ స్పెషలాఫీసర్ రమేష్ అన్నారు. తిరుమలాయపాలెం మండల పరిధిలోని వైద్యవిధాన పరిషత్, దమ్మాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జల్లేపల్లి దవఖానాను స్థానిక ఎంపిడిఓ ఎస్కే సిలార్‌సాహెబ్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందిస్తున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఓపి రిజిస్టరర్ తనిఖీ చేశారు. గర్భిణిస్త్రీలు ప్రభుత్వ దవఖానాల్లోనే సాధారణ డెలవరీలు అయ్యే విధంగా ప్రతిఒక్కరూ పోత్సహించాలని తెలిపారు. దమ్మాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు మూడు గంటలకే తాళాలు వేయటంపై ఆయన మండిపడ్డారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించి వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

# పారిశుధ్య లోపంతోనే విషజ్వరాలు



**-గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి**
**-సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు**

ప్రజాపక్షం/కొణిజర్ల : గ్రామాల్లో పారిశుధ్య లోపంతో ప్రజల్లో అవగాహన లేమితో విషజ్వరాలు విజృంభించి ప్రజల ప్రాణాలు హరించివేస్తున్నాయని సిపిఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు ఆరోపించారు. శుక్రవారం ఆయన కొణిజర్లలో మాట్లాడుతూ పలు గ్రామాల్లో డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని నిర్వహణ లేని కారణంగా విషజ్వరాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో తనికెళ్లకు చెందిన కూచిపూడి హరిత శుక్రవారం విషజ్వరం బారినపడి మృతిచెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేటు ఆసుపత్రిలో డెంగ్యూ సోకిందని కుటుంబసభ్యులు చెప్పారని తెలిపారు. కేవలం నాలుగైదు రోజుల్లోనే విషజ్వరంతో మహిళ మృతిచెందడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. వైద్యశాఖ , పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. డ్రయినేజీలోని పూడిక వెంటనే తీయించాలని మురుగు గుంతల్లో నీరు నిల్వలేకుండా చేయాలని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీయుజేఏసీ జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నేలకొండపల్లి మండలం లోని నాచేపల్లి గ్రామానికి చెందిన మందడి వెంకటేశ్వరరావు ను రాష్ట్ర కమిటి సభ్యులుగా శుక్రవారం నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి నియామకపు పత్రాలను జిల్లాఅధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. ఉద్యమకారులకు తెలంగాణ ప్రభుత్వం 250 గజాల స్థలం తో పాటు ఇంటి ని మంజూరు చేయాలని కోరారు. ఆరోగ్యకార్డులను అందించాలని కోరారు. రైలు, బస్సు పాసులను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఉద్యమకారుడు కు పెన్షన్ ను ఇవ్వాలని కోరారు. ఉద్యమకారుల పై పెండింగ్ లో ఉన్న కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులు రానున్న స్థానిక సంస్థలలో పోటీ చేయనున్నట్లు తెలిపారు. అన్ని పార్టీలు, మేధావులు మద్దతు ఇవ్వాలని కోరారు. త్వరలోనే కమిటీలు ఏర్పాటు చేసి జేఏసీ ని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తీగ రాములు, జీ.నాగమణి, బీ.నాగేశ్వరరావు, కాకామాను మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియా వాడకంతో అధిక లాభాలు



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : వ్యవసాయ రంగంలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో మార్పులు వస్తున్నాయని రైతులు సులభతరంగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు నూతన సాంకేతికత దోహదపడుతుందని కూసుమంచి వ్యవసాయ సంచాలకులు మిట్టపల్లి సతీష్ అన్నారు. మండల పరిధిలోని సుబ్లేడు గ్రామంలో నానో యూరియా, డిఏపి వాడకాన్ని రైతులకు క్షేత్రస్థాయిలో పంటలకు సాగు చేసి అవగాహన కల్పించారు. రైతులు పంటలు సాగు చేసిన 45రోజుల తర్వాత మొదటి దశలో అంతర్గత భూమిలో యూరియా, డిఏపి ముడి పదార్థాన్ని విత్తిన మొక్కలకు అందించిన అనంతరం రెండవ దశలో నానో యూరియా డిఏపి రసాయనిక ఎరువులో పాటు ఒక ఎకరానికి లీటర్ నీటికి 2.5ఎంఎల్ నీళ్లలో కలిపి పిచికారీ చేయాలని, తద్వారా వ్యవసాయ ఖర్చులుఉ తగ్గుతాయని తెలిపారు. ప్రతి రైతు వేసవిలో దుక్కులు సిద్ధం చేసుకునే సమయంలో భూసార పరీక్షలు చేయించుకుని పంట మార్పిడి పంటలు సాగు చేసుకుంటే అధిక దిగుబడితో పాటు ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారామరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జ్వరంతో మహిళ మృతి



ప్రజాపక్షం/కొణిజర్ల : విషజ్వరంతో మహిళ మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని తనికెళ్లలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం తనికెళ్ల గ్రామానికి చెందిన కూచిపూడి హరిత (35) గత ఐదురోజులుగా జ్వరంతో బాధపడుతుంది. తనికెళ్లలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఒ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో గురువారం హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం చేయిస్తుండగా మృతిచెందిందని డెంగ్యూ జ్వరంతోనే తన భార్య చనిపోయిందని మృతురాలి భర్త నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద గోపతి ప్రాథమిక వైద్యులు డాక్టర్ రాధాకృష్ణను వివరణ కోరగా డెంగ్యూ జ్వరంతో చనిపోలేదని పరీక్షల్లో డెంగ్యూ నెగిటివ్ వచ్చిందని డెంగ్యూ లక్షణాలు మాత్రము ఉన్నాయని ప్లేట్ లెట్స్ కూడా బాగానే ఉన్నాయని తెలిపారు. మృతురాలికి భర్త నవీన్, 11 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు.

# సూపర్‌జెమ్స్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల కేంద్రం కొణిజర్లలో సూపర్‌జెమ్స్ పాఠశాలలో శుక్రవారం అడ్వాన్స్ రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు సోదరభావంతో ఒకరికొకరు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలలోని కవల పిల్లలు అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్లకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కొణతం ఉమాశంకర్ మాట్లాడుతు దేశం మొత్తం కులమతాలకు అతీతంగా సోదరభావంతో జరుపుకునే ఏకైక పండుగ రక్షాబంధన్ పండుగ అని అన్నారు. దీనివలన సోదర, సోదరీమణుల మధ్య మరింత అప్యాయత, అనురాగం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మాక్ పోలింగ్



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరులోని బాలాజీ పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించి ప్రజాప్రతినిధులను ఎన్నిక విధానాన్ని ఓటు వేసే విధానాన్ని ఫలితాలను రౌండ్ల వారీగా ముందంజలో ఎవరు ఉన్నారు అంటూ ప్రకటిస్తూ ఫలితాలను ప్రకటిస్తూ పూర్తిస్థాయిలో మాక్ పోలింగ్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఓటు వేసే విధానం, వినియోగించే విధానము భారతదేశంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు ఏ విధంగా నిర్వహించడం ఇష్టమైన అభ్యర్థిని ఎంపిక చేసే ఎన్నిక చేసుకునే విధానము ఏ విధంగా జరుగుతుంది నామినేషన్ పద్ధతి విద్యార్థుల నుంచి ప్రచారం నాలుగో తరగతి నుంచి పదవ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రత్యక్షంగా అనుభవించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బాలాజీ, ప్రధానోపాధ్యాయులు నరేంద్ర లతో పాటు, ఉపాధ్యాయ సిబ్బంది ఎన్నికల అధికారులుగా నిర్వహించారు.

# డివైడర్ రంగులను పరిశీలించిన కమిషనర్



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో డివైడర్ మధ్యచెట్లను తొలగించిన అనంతరం డివైడర్‌కు వేస్తున్న నూతన రంగులను మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు మున్సిపాల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రంగులు నాణ్యతతో ఉండాలని పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు డివైడర్ శుభ్రపరచడంతో పాటు రంగులు వేయడం జరుగుతుందని కమీషనర్ చింతా వేణు తెలిపారు. కార్యక్రమంలో పలువురు మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/వైరా: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బిటెక్ రెండో సంవత్సరం హైదరాబాద్ హిందూ కాలేజీలో డేటా సైన్స్ చదువుతున్న ఏన్కూరుకు చెందిన నిరుపేద విద్యార్థి కారుమంచి వినయ్‌కు రూ.10వేలను ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ చేతుల మీదుగా శుక్రవారం గుట్టబడి స్కూల్ నందు లయన్స్ సభ్యుల మధ్య అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్‌రావు, జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు, లయన్స్ కంటి హాస్పిటల్ నిర్వాహకులు వుంద్రు శ్యామ్‌బాబు, రీజియన్ సెక్రటరీ పెనుగొండ ఉపేందర్‌రావు, ఎల్ఐసిఎఫ్: కోఆర్డినేటర్ చింతలపూడి వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షులు వై.బుచ్చిరామారావు, సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఓ వ్యక్తి మోసం

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండలం పరిధిలోని పేరువంచ గ్రామానికి చెందిన మాజీ సైనిక అధికారి అని చెప్పుకుంటూ పరిమి భరత్ అనే వ్యక్తి ఉద్యోగాలు ఇస్తామంటూ నిరుద్యోగుల నుంచి సుమారు ప్రస్తుతానికి రూ. 14 లక్షలు వసూలు చేసినట్లు కల్లూరు పోలీస్ స్టేషన్‌లో సదరు బాధితులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై హరిత తెలిపారు. పరమేశ్వర్ అనే వ్యక్తి తన కొడుక్కి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఇటీవల కాలంలో నగదు రూపంలో రూ. 14 లక్షలు చెల్లించిన కూడా ఉద్యోగం ఇప్పించకపోవడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు బాధితులు అందరూ పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ విషయమై కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు ఎస్సై పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పలువురు బాధితులు ఇంటికి వెళ్లి తెలుసుకుంటున్నారు. ఆ వ్యక్తి ఓ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తిని మండలంలో ప్రచారం అవుతుంది.

# సోదర, సోదరీమణుల బంధానికి ప్రతీక రాఖీ పండుగ



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** రాఖీ పౌర్ణమి పండుగ అన్నదమ్ముల నడుమ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకుట్టారు. ఉదయం నుండే సోదరీమణులు తమ సోదరుల చెయ్యికి రాఖీలు కట్టి, ఆయురారోగ్యాలతో పాటు విజయాలు కలగాలని కోరుకుట్టారు. ప్రతిగా సోదరులు వారికి బహుమతులు అందజేసి, జీవితాంతం రక్షణగా ఉంటామని హామీ ఇస్తారు. ఎంతో ఆనందంగా ఆ బహుమతులను ఆడపడుచు స్వీకరిస్తారు. ఉదయం నుండే గృహాల్లో రాఖీ కట్టింపులు స్వీట్లు పంచుకోవడం బహుమతులు ఇవ్వడం లాంటివి జరుగుతుంటాయి. తల్లిదండ్రులు పిల్లలకు సోదరా భావం పరస్పర రక్షణ వంటి విలువలను తెలియజేస్తారు. రాఖీ పౌర్ణమి కేవలం పండుగ మాత్రమే కాకుండా మనసులను దగ్గర చేసే ఒక మానవీయ వేడుక అని పెద్దలు చెబుతుంటారు. పాఠశాలలు, కళాశాలల్లో సైతం రక్షాబంధన్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించి విద్యార్థిని విద్యార్థుల పట్ల సోదరా భావాన్ని పెంపొందిస్తారు. అనేక స్వచ్ఛంద సంస్థలు అనాథ పిల్లలకు, సైనిక సోదరులకు రాఖీలు కట్టి స్నేహం, సోదరభావాన్ని ప్రదర్శి ఇస్తారు. సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న జవాన్లకు సైతం వారి సోదరీమణులు రాఖీలు రాఖీలు పంపి ఆనందపడతారు. ఈ పండుగ సోదర,సోదరీల అనుబంధాన్ని మాత్రమే కాదు, సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం, రక్షణ అనే విలువలను కూడా గుర్తుచేస్తుందీ .

# పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు : ఐటిడిఏ పిఓ



**ప్రజాపక్షం/భద్రాచలం :** కఠ్రీషి పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్లో హన్మకొండలో జరిగిన 34వ సౌత్ జౌన్ మీట్లో రాష్ట్రస్థాయి పోటీల్లో భద్రాచలానికి చెందిన బట్ట ప్రసాద్ కుమార్తె బట్ట పృద్విక జావలిన్ త్రో లో 2వ స్థానం, ఎస్కే మస్తాన్ వలీ కుమార్తె ఎస్‌కె అమ్రిన్ 100 మీటర్ల హ్యాండిల్స్ లో 2వ స్థానంలో నిలిచి పథకాలు సాధించారు. ఈ సందర్భంగా పిఓ బాలికలతో పాటు కోచ్‌లను అభినందించారు. బాలికలను స్ఫూర్తిగా తీసుకుని తోటివారు కూడా వారికి ఇష్టమైన క్రీడల్లో శిక్షణ తీసుకుని జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం పిఓను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుంజ ధర్మ, పూనెం కృష్ణ, గుండు శరత్, కణితి రాధ, కోడి శ్రీదేవి, మిడియం నాగమణి, కోచ్‌లు జున్ను, గిరి ప్రసాద్, విద్యార్థినీలు తదితరులున్నారు.

# ఆదివాసీ దినోత్సవం విజయవంతానికి కృషి చేయండి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ఆదివాసీఐక్యకార్యచరణ సమితి సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్లో ఐటిడిఏ పిఓ ఆదేశాల మేరకు సమితి సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఎంఎల్ఏ తెల్లం వెంకట్రావుతో పాటు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారని అన్నారు. గిరిజన ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం అతిధులకు మంచి అతిథ్యం ఇవ్వాలని, గిరిజన వంటకాలు రుచిచూపించాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహనీయులకు శ్రద్ధాంజలితో పాటు ర్యాలీలు, జెండా ఆవిష్కరణలు ఉంటాయని, కార్యక్రమం పూర్తి క్రమశిక్షణతో సాగిలే ఐక్యకార్యచరణ సమితి చొరవచూపాలని, అతిధులతో పాటు ప్రజలకు ఆదివాసీ వంటకాలతో భోజన సౌకర్యం కల్పించాలని, గిరిజన సంస్కృతి సంప్రదాయ నృత్యాలు ఏర్పాటు చేసి కనువిందు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ప్రజాప్రతినిధులు పూనెం కృష్ణ, కుంజ ధర్మ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఐటిడిఏ పిఓ మానస పుత్రిక ఉద్దీపకము అధోగతేనా..!

**- ఎస్‌సిఆర్‌పి పర్యవేక్షణ లోపం**
**-గొందిగూడెం ఆశ్రమ పాఠశాల**
**పే సెంటర్ నుండి విధులు నిర్వహణ**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** గిరిజనుల్లో ఆంగ్లం మీద పట్టు కోసం ఐటిడిఏ పిఓ ప్రత్యేకంగా చొరవ తీసుకున్న ‘ఉద్దీపకము’ చివరకు అధోగతి పాలయ్యింది. ఫస్ట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలో విద్యలో కొత్తగా ఆంగ్లంలో బోధించడం, మాట్లాడటం లాంటివి జరుగుతున్నాయి. ఆ ఉద్దేశంతోనే ఐటిడిఏ పిఓ రాహుల్ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క భద్రాద్రి జిల్లాలోనే భద్రాచలం ఐటిడిఏ పరిధిలోని అన్ని గిరిజన పాఠశాలలో ఆంగ్లంలో విద్యార్థులు పట్టు సాధనకై ఉద్దీపకము అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి విద్యార్థులకు సులువుగా బోధించడం వారు సులువుగా నేర్చుకోవడం లాంటి వాటి కోసం కొన్ని నిధులు ఖర్చు చేసి పుస్తకాలు ప్రవేశపెట్టి ఉద్దీపకము అనే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంపై ప్రతి పే సెంటర్‌లో ఒక ఎస్‌సిఆర్‌పిని నియమించారు. ఎస్‌సిఆర్‌పి పరిధిలోని ఆ పాఠశాలలకు వెళ్లి పర్యవేక్షించి విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికి తీసే విధంగా ఉపాధ్యాయులకు విద్యార్థులకు తగిన సహాయ సహకారాలు అందించాలి. ప్రతి రిపోర్టును ఐటిడిఏ విద్యాశాఖ అధికారులకు అందించాలని, కానీ పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం మండలంలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాల పే సెంటర్‌గా 18 అనుబంధ పాఠశాలలను ఈ ఎస్‌సిఆర్‌పి రోజుకు కనీసం 1 నుండి 3 పాఠశాలలు పర్యవేక్షించాలి. కానీ ఈ ఎస్‌సిఆర్‌పి పాఠశాలలు ప్రారంభించిన ఇప్పటికి 50 రోజులు అవుతున్న కొన్ని పాఠశాలలను మాత్రమే పర్యవేక్షించి జీతాలు, వాహన అలవెన్స్‌లను



మాత్రం నెల నెలల తీసుకోవడం జరుగుతుంది. అమ్మ ఆదర్శ పాఠశాల బిల్లులు చేసే పర్యవేక్షకులు కాకపోయినా కానీ మేమే బిల్లులు చేసేదని ప్రధానోపాధ్యాయులు, ఎస్‌సిఆర్‌పిలు ఇద్దరు కలిసి గ్రామ సమాఖ్య విఓల వద్ద వీరి విందు, మందు పార్టీలకు డబ్బులు తీసుకోవడం వాటితో మారుమూల ప్రాంతం మామిళ్ళవాయిలో గ్రామస్తుల మధ్యలో మందు పార్టీలు చేసుకుంటున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పర్యవేక్షణ సమయంలో వీరికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరికి రాచ మర్యాదలు చేయాల్సిందే అంటే వీరి మధ్య ఏలాంటి సంబంధం ఉందో అధికారులే చెప్పాలి. అదే విధంగా ఈ పే సెంటర్ పరిధిలో వాటిని పర్యవేక్షించేది కూడా ఈ ఎస్‌సిఆర్‌పినే చివరకు పని చేయకపోయిన జీతాలు చెల్లిస్తున్న ప్రధానోపాధ్యాయులనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పే సెంటర్‌లోని ప్రధానోపాధ్యాయులు ఎస్‌సిఆర్‌పి ఇద్దరు కలిసి వాహన అలవెన్స్‌లు జీతాలను చెరో సగమనుకున్నట్లు పంచుకుంటూ గిరిజన భవిష్యత్తును విద్యను గాడి తప్పించి, ఉద్యోగాన్ని పక్కకు పెట్టి జీతాన్ని మాత్రం తీసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇదే ఆశ్రమ పాఠశాల హాస్టల్‌పై ఆహార నాణ్యతలో గిరిజన విద్యపై లోపాలు వస్తుంటే వీరిపై చర్యలు తీసుకునేపై అధికారి ఇంత వరకు ఎటువంటి బాధ్యతారాహిత్య చర్యలు తీసుకోలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు తదితరులు కోరుతున్నారు.

# వైభవంగా వరలక్ష్మి వ్రతం



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం పట్టణంలో శుక్రవారం మహిళలు శ్రావణ మాసం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారికి, తులసి మాతకు విశిష్ట పూజలు చేశారు. పూజల అనంతరం స్థానిక మహిళా ముత్తైదువులకు ఆకు,వక్క, పసుపు ,కుంకుమ, గాజులు పండ్లు పూలతో వాయనాలు అందించారు. ఉదయం నుండి పట్టణంలోని ప్రధాన దేవాలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. హిందూ సంప్రదాయంలో ఎంతో విశిష్టత గావించిన పండుగ వరలక్ష్మి వ్రతం అని మహిళలు అన్నారు. ముఖ్యంగా స్త్రీలు ఆచరించే ఒక ముఖ్యమైన వ్రతం వరలక్ష్మీ వ్రతమని, లక్ష్మీదేవిని నిష్టతో, భక్తి శ్రద్ధలతో విశ్వాసంతో పూజిస్తే భోగభాగ్యాలు కలుగుతాయని తెలిపారు.

# రాఖీలు కట్టిన మహిళా న్యాయవాదులు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాదులు రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మకు శుక్రవారం రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా మహిళా న్యాయవాదులతో పాటు పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి పండుగ తెలుగు ప్రజలు నిర్వహించే పండుగల్లో ఒకటని అన్నారు. ఈ పండుగ నాడు మహిళలంతా రాఖీలు కడుతూ సంతోషకరమైన వాతావరణంలో హాయిగా గడుపుతుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనపరెడ్డి గోపికృష్ణ, న్యాయవాది, జూనియర్ మహిళా న్యాయవాదులు ఆర్తి మక్కడ్, నకరికంటి ఉమా, యాస మౌనిక, అరుణలత, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి. గృహ పరిసరాలలో, వీధులలో నీరు నిల్వ ఉండటం, పాత టైర్లలో కొబ్బరి బోండాలు లో మురికి నీరు లార్వా పెరిగి ఉండటం లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మూలించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం, మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్మూలించేందుకు ప్రత్యేక ప్రణాళిక లను ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపాలిటీ పరిధిలోని వాచానాయక్ తండ, జిడిపి పల్లి, కప్పల బంధం, తూర్పు, పడమర లోకవరం, కల్లూరు, పుల్లయ్య బంజర, కృష్ణయ్య బంజర గ్రామాలలో స్థానిక అంగన్వాడి, ఆశ, ఆరోగ్య కార్యకర్త లు, రిసోర్స్ పర్సన్ లు, మున్సిపాలిటీ సిబ్బందితో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తూ దోమల పుట్ట కుండ కుట్టకుండా పెరగకుండా దుర్వాసనలు లేకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉంటున్నామని మున్సిపాలిటీ కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో మేనేజర్ నాగేశ్వరరావు, వార్డు అధికారులు అంగన్వాడి సిబ్బంది, బిల్ కలెక్టర్లు, మున్సిపాలిటీ సిబ్బంది, రిసోర్స్ పర్సన్ లు, కార్మికులు ఈ కార్యక్రమాల్లో ప్రతి శుక్రవారం మంగళవారం పాల్గొంటున్నారు.

# విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండి కల్లూరు విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో ఉన్న వినియోగదారులకు ఎస్సీ కాలనీలలో విద్యుత్ సిబ్బంది దుస్తులు ఆరబెట్టి క్రమంలో ఇనుప తాడు వద్దు నైలాన్ తాడు ముద్దు, అనే నినాదంతో గ్రామాల్లో వినియోగదారులతో అవగాహన కార్యక్రమం విద్యుత్ శాఖ అధికారులు రామిరెడ్డి, వెంకట్ లు తమ సిబ్బందితో వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నైలాన్ తాడు వాడటం వలన విద్యుత్ ప్రమాదాలు జరగవని ఆపవచ్చని దుస్తులు ఆరబెట్టే క్రమంలో ఇనపతాడు వాడటం వలన ప్రమాదాలు జరుగుతాయని, నైలాన్ తాడు వాడాలని అధికారులు వినియోగదారులకు అవగాహన సదస్సులు గ్రామీణ ప్రాంతాలలో శుక్రవారం నిర్వహించారు. విద్యుత్ పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తగా పాటించాలని విద్యుత్ శాఖ అధికారులు వినియోగదారులకు మండల పరిధిలోని చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, నారాయణపురం, గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించి నైలాన్ తాడును ఉచితంగా పంపిణీ చేశారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/పినపాక:** మండల పరిధిలోని ఏడుళ్ళ బయ్యారం క్రాస్ రోడ్ లో ఈనెల 10వ తారీఖున వికలాంగుల మహా గర్జన సభకు ఆటో కార్మికులందరూ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు వల్లెపోగు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరుగా మందకృష్ణ మాదిగ దృష్టికి ఆటో డ్రైవర్ సమస్యలు తీసుకెళ్తానని, ఆటో కార్మికులందరూ మణుగూరు సురక్ష బస్టాండు వద్దకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నరైనా ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆటో డ్రైవర్లు అప్పుల పాలు కావడంతో పాటు అనేక మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఆటోడ్రైవర్ల సమస్యను పరిషారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వల్లెపోగు వెంకటేశ్వర్లు మాదిగ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలి



**-జిల్లా ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి**
**-క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి**
**- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుడా క్రింద జిల్లా ఆసుపత్రిలో 13 అభివృద్ధి పనులు రూ. 25 కోట్లతో చేపట్టామన్నారు. రూ. 23.75 కోట్లతో చేపట్టిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. తక్కువ ఖర్చుతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడే యంత్రాల కొనుగోలు, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలన్నారు. అవసరమైన నిధులను తప్పనిసరిగా మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం ఆసుపత్రి నందు రోగులకు ఉపయోగపడేవిధంగా మరుగుదొడ్ల మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లా ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో అందుబాటులో ఉన్న యంత్రాలు, వాటి ప్రస్తుత స్థితిగతులపై రిపోర్ట్ తయారు చేయాలని, మరమ్మతుకు గురైన యంత్రాలను బాగు చేసేదుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన ఇన్ ఫ్రా సౌకర్యాలపై ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు. ప్రజలలో ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం కలిగించేందుకు ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చాలా కీలకమని, మన ఆసుపత్రికి కార్పొరేట్ లుక్ తీసుకుని రావాలన్నారు. ఆసుపత్రి అంతర్గతంగా సిసి రోడ్ల నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని, డిఎంఎఫ్‌టి లేదా ఇతర నిధుల నుంచి మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥ ఎం. నరేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డా॥ బి.కళావతిబాయి, డిసిహెచ్‌ఎస్ డా॥ రాజశేఖర్, వివిధ విభాగాల అధిపతులు, వైద్యశాఖ ఇఇ ఉమామహేశ్వరరావు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బందారు పుల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన కూనంనేని



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల కేంద్రం కొణిజర్లలో సిపిఐ సీనియర్ నాయకులు మాజీ సొసైటీ అధ్యక్షుడు బందారు పుల్లయ్య ఇటీవల కాలంలో గుండెపోటుతో మృతిచెందాడు. శుక్రవారం కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పుల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, మండల సహాయ కార్యదర్శి స్వర్ణ రమేష్, జిల్లా నాయకులు , పిఏరావు, పోటు పూర్ణ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, తోటపల్లి సీతారాములు, కొమ్మిన్ని వెంకయ్య, అడపా బాబు, తండు సోమయ్య, బందారు వెంకన్న, అడపా వెంకటి, కొమ్మిన్ని నరసింహారావు, యర్రా శ్రీను, గొడ్డుగొర్ల రాంబాబు, బందారు పుల్లయ్య కుమారుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఐజెయు బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ

**-కె. రాంనారాయణ**
**- జాతీయ కౌన్సిల్ సభ్యులుగా రాంనారాయణ, నలజాల వెంకట్రావు**
**-పలువురి అభినందన**





**ప్రజాపక్షం/ఖమ్మం :** ఐజెయు బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని అందుకు అనుగుణంగా పనిచేయాలని టియుడబ్ల్యుజె (ఐజెయు)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పాలక వర్గాలు తగు రీతిలో స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యుల నామినేషన్ ప్రక్రియ కార్యక్రమం శుక్రవారం ఖమ్మం జెడ్పి మీటింగ్ హాల్‌లో జరిగింది. నామినేషన్ ప్రక్రియకు ముందు జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో రాంనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అనేక దశాబ్దాలుగా పోరాడుతున్న సంఘం టియుడబ్ల్యుజె (ఐజెయు) మాత్రమే నన్నారు. ప్రస్తుతం జర్నలిస్టులకు వృత్తిపరమైన భద్రత లేదని అదే సమయంలో సంక్షేమ కార్యక్రమాల అమలు జరగడం లేదన్నారు. జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఖమ్మం జిల్లాకు కేటాయించబడిన రెండు స్థానాలకు గాను కె. రాంనారాయణ, నలజాల వెంకట్రావు లు నామినేషన్లు వేశారు. రాంనారాయణను మైసా పాపారావు బలపర్చగా వెంకట్రావును ఏనుగు వెంకటేశ్వరరావు ప్రతిపాదించారు. మాటేటి వేణుగోపాల్, వనం వెంకటేశ్వర్లు, నాగండ్ల శివానంద్, కనకం సైదులు, మామిళ్లపల్లి భూపాల్, మహేందర్, చెరుకుపల్లి శ్రీనివాస్, చారి, నామ పురుషోత్తం తదితర 25 మంది టియుడబ్ల్యుజె (ఐజెయు) సభ్యులు బలపరిచారు. జిల్లా నుండి రెండు నామినేషన్లు దాఖలు కావడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నర్వనేని వెంకట్రావు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన టియుడబ్ల్యుజె (ఐజెయు), ఖమ్మం జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, యూనియన్ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏలూరి వేణుగోపాల్, శ్రీనివాసరావు, నామ పురుషోత్తం, శీలం శ్రీనివాస్, కళ్యాణ్, డి. రమేష్, గోపాలరావు, ఎం. బాబురావు, రాజారావు, సత్యనారాయణ, ఎవి రామారావు, ఉపేందర్, కృష్ణార్జున్, ఆలస్యం అప్పారావు, మేడి రమేష్, శ్రీనివాస్, గోసు నాగేశ్వరరావు, సుమన్ టివి ఉమ్మడి జిల్లా బ్యూరో రామకృష్ణ, ఖమ్మం టివి శ్రీనివాస్, నాగేశ్వరరావు, కుమార్, ఫోటో జర్నలిస్టు రవి తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎంపికైన వారిని పూలమాలలు, శాలువలతో సన్మానించారు.

# 11న చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఇందిరా పార్కులో ఈనెల 11న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘాల జేఏసి నాయకులు కోరారు. పెన్షనర్ల జేఏసి సమావేశం శుక్రవారం కృషి భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలు తక్షణం చెల్లించాలని, నగదు రహిత వైద్య సౌకర్యాలను సత్వరం అమలు చేయాలని, పెండింగ్ డిఆర్‌ను మంజూరు చేసి ఏక మొత్తంలో చెల్లించాలని, పిఆర్‌సి ప్రకటించి అమలు చేయాలని తదితర డిమాండ్‌లతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జేఏసి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు ఎస్. రంగారావు, వెంకటేశ్వర్లు, రాయల రవికుమార్, సోమయ్య, లక్ష్మి నారాయణ, తిరుపతయ్య, సుధాకర్‌రావు, కృష్ణయ్య, ఉప్పలయ్య, కోట్యా తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతల శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఈ నెల 10వ తేదీని జరుగనున్న జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి మండలం నుండి వేలాదిగా ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జవహర్ ఎత్తిపోతల పథకం ద్వారా మధిర, ఎర్రుపాలెం మండలాల రైతులకు సాగునీటి కష్టాలు తీరుతాయని అన్నారు. మూడవ జోన్ నుండి రెండవ జోన్‌కు మార్పు చేసేందుకు రూ.630కోట్లతో నూతన ఎత్తిపోతల పథకానికి సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి డిప్యూటీ మల్లు భట్టివిక్రమార్క సహకారంతో నిధులు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, మల్లెల లక్ష్మ ణరావు, పంబి సాంబశివరావు, కడియం శ్రీనివాసరావు, కంచర్ల వెంకటనర్సయ్య ,వెన్నపూస కృష్ణారెడ్డి, శీలం వెంకటామిరెడ్డి, షేక్.ఇస్మాయిల్, గుర్రాల పుల్లారెడ్డి, మొగిలి అప్పారావు, రాజీవ్‌గాంధీ, పిచ్చిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం సీనియర్ నాయకులను పరామర్శించిన తమ్మినేని



**ప్రజాపక్షం/వైరా:** సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ పార్లమెంటు సభ్యులు తమ్మినేని వీరభద్రం, పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతో కలిసి వైరా మున్సిపాలిటీలో విస్తృతంగా పర్యటించారు. పలువురు పార్టీ సీనియర్ నాయకులు స్వగృహాలకు వెళ్లి వారి యోగక్షేమాలు ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైరా పట్టణ నివాసి పార్టీ సీనియర్ నాయకులు దూళిపాళ్ళ వెంకటేశ్వర్లును పరామర్శించారు. ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు వయోభారం, అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆరోగ్యం సహకరించకపోయినా పార్టీ పట్ల అత్యంత నిబద్ధతతో ముఖ్యమైన కార్యక్రమాలకు హాజరవుతున్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామం నివాసి అమరజీవి కామ్రేడ్ సంక్రాంతి మధుసూదన్‌రావు సోదరుడు పార్టీ సీనియర్ నాయకులు సంక్రాంతి కృష్ణమూర్తి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. సంక్రాంతి కృష్ణమూర్తి అనారోగ్యంతో బాధపడుతున్నారు. సంక్రాంతి మధుసూదన్‌రావు మరణాంతరం తీవ్ర మనోవేదనకు గురయ్యారు. అనారోగ్యానికి వైద్యం చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. తమ్మినేని వారితో మాట్లాడి వారి ఆరోగ్య వివరాలు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో తమ్మినేని వెంట పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, మెరుగు సత్యనారాయణ, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యురాలు మచ్చా మణి, పట్టణ కమిటీ సభ్యులు పైడిపల్లి సాంబశివరావు, గుమ్మా నర్సింహారావు, కామినేని రవి, సీనియర్ నాయకులు వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు, ఇమ్మడి వీరభద్రం, కిన్నెర మోతి, పింగలి రామారావు, పల్లెబోయిన కృష్ణ, సోషల్ మీడియా వైరా డివిజన్ కన్వీనర్ గుడిమెట్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల సమగ్ర సవరణ సరైంది కాదు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సమగ్ర సవరణ సరైంది కాదంటూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ త్వరలో బీహార్‌లో జరగబోయే ఎన్నికల్లో అధికారం నిలబెట్టుకోవడం కోసం బిజెపి , ఎన్‌డిఏ ప్రభుత్వం కుట్రల పన్నుతోందన్నారు. బీహార్ ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస పోయారానే సాకుతో బడుగు బలహీన వర్గాలు, ఓ మతానికి చెందిన వారి ఓట్లు ఏకపక్షంగా సుమారు 65 లక్షల ఓట్లను తొలగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించి రద్దు చేసిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేదంటే అన్ని రాజకీయ పక్షాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైవి రామారావు, నాగరాజు, రమేష్, శ్రీనివాస్, ఫిరోజ్, అజయ్ కుమార్, రాఘవయ్య, రవి, మురళి, నాగమ్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.